క్లుప్తంగా

'కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తాం'

ఇచ్చోడ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగలకు ఒక్క పార్లమెంట్ స్థానం ఇవ్వలేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా వారం రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, మచ్చ గంగయ్య, కల్లేపల్లి రాజు, గోటిముఖేలే మధుకర్, చిట్టి రవి, రాజు, కాశిపాక విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్‌లో బుధవారం పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను సిబ్బంది శేఖర్, దేవురావులు వేసినట్లు మండల పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ తెలిపారు. గత నెల రోజుల నుంచి మండల వ్యాప్తంగా పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు.

సన్మానం

నేరడిగొండ: బీజేపీ నేరడిగొండ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సాబ్లే సంతోష్ సింగ్‌ను మండల కార్యవర్గ సభ్యులు, నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం మండల కేంద్రంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టిన జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

గాలివానకు దెబ్బతిన్న పంటలు



తాంసి శివారులో నేలకొరిగిన జొన్న పంట

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి వర్షం కురిసింది. ఈదురు గాలులతో పాటు వర్షం కురవడంతో తాంసి, పొన్నారి, వడ్డాడి, హస్నాపూర్, పాలోది, గిరిగాం, కప్పర్ల గ్రామాల్లో జొన్న పంట నేలకొరిగింది. నీటి తడులు అందక ఎండిపోతున్న పంటలకు ఈ వర్షంతో జీవం పోసినట్లయింది. రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

యువత క్రీడాస్ఫూర్తి చాటాలి

నేరడిగొండ: యువత క్రీడా స్ఫూర్తి చాటాలని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్ గ్రామంలో బుధవారం వడూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే వారు మంచి ప్రతిభ కనబర్చి జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్ అన్నారు. బుధవారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన చిచ్‌ధరి ఖానాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు పోష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మీబాయి, కొడప యశోదా, శైలజ, ఆకాంక్ష పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

తాంసి: ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తాంసి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రావ్యవాణి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. మధ్యాహ్నం బయటకు రావద్దన్నారు. వారి వెంట ఎంపీడీవో మోహన్ రెడ్డి, ఏపీవో విజయ, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

స్థల పరిశీలన

సిరికొండ: సిరికొండ మండలానికి మంజూరైన పీహెచ్‌సీ నిర్మాణానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో కుడ్మేత మనోహర్ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన పత్రాలు పరిశీలించి తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అందని భోజన బిల్లులు

- అప్పు చేసి వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు
- వెంటనే చెల్లించాలని వేడుకోలు



వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో నిర్వాహకులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే కుక్ కావర్ హెల్పెర్‌కు ఒక్కొక్కరికి రూ. 3వేలు వేతనాల్లో రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ. 2 వేలు, కేంద్ర బడ్జెట్ నుంచి రూ. 1000 ఇస్తున్నారు. ఇవి కూడా సకాలంలో చెల్లించడం లేదు.

అప్పులు చేసి వండి పెట్టి..

మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వంటకాలు తప్పనిసరి కావడంతో కిరాణ, కూరగాయల దుకాణాల్లో రూ. వేలల్లో అప్పులు తెచ్చి వంటలు వండి పెడుతున్నారు. ఆయా షాపులలో నెలల తరబడి బిల్లులు పేరుకుపోవడంతో కొన్ని సందర్భాల్లో షాపుల యాజమానులు సరుకులు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 85 లక్షలు పెండింగ్‌లో..

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 78 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 3,975 మంది విద్యార్థులు ఉన్నారు. మావల మండలంలో 9 పాఠశాలలు ఉండగా.. 723 మంది ఉన్నారు. ఆదిలాబాద్ అర్బన్‌లో 71 పాఠశాలలు ఉండగా.. 11,432 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా పాఠశాలలోని విద్యార్థులకు 285 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు మధ్యాహ్నం భోజనం వండిపెడుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఫిబ్రవరి, మార్చి, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వరకు భోజన బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు అన్ని పాఠశాలలకు రావాల్సి ఉంది. మొత్తం ఆయా పాఠశాలలకు రూ. 85,13,654 బకాయిని ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

ప్రతిసారి ఇదే పరిస్థితి

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు అందించకపోవడంతో ప్రతీసారి ఆలస్యం కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో కొన్ని చోట్ల మెనూ ప్రకారం భోజనం అందించలేకపోతున్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేస్తే తమకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఉండదని మధ్యాహ్న భోజన నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బిల్లులను సకాలంలో చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు.

ట్రెజరీకి పంపించాం

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సంబంధించిన బిల్లులు ట్రెజరీకి పంపించాం. ఇతర కారణాల వల్ల బిల్లులు రిజెక్ట్ అయ్యాయి. నిర్వాహకులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలో బిల్లులు వస్తాయి. అలాగే వేతనాలు సైతం వస్తాయి.

– జయశీల, ఎంఈవో, ఆదిలాబాద్

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



పాదయాత్రలో పాల్గొన్న జెడ్పీచైర్మన్

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత మార్గంలో నడవాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బుధవారం నార్నూర్ మండలంలోని కొత్తపల్లి బంజారా దీక్షభూమి నుంచి బంజారా కాశీ పొరదేవి వరకు ప్రేంసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో సేవాలాల్ దీక్ష తీసుకొని పాదయాత్రగా బయలుదేరారు. ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లో గ్రామస్తులు భక్తులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సేవాలాల్ దీక్ష తీసుకొని ప్రేమ్‌సింగ్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, నరేశ్ జాదవ్, ఐటో ప్రకాశ్ రాథోడ్, శ్రీరాంనాయక్, భరత్‌చౌహాన్, బానోత్ జగన్, గజానంద్ నాయక్ పాల్గొన్నారు.

రంజాన్‌కు సర్వం సిద్ధం



ఈద్గా వద్ద ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి

ఇంద్రవెల్లి: రంజాన్ వేడుకలు గ్రామ పంచాయతీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని హీరపూర్ సమీపంలోని ఈద్గా వద్ద గ్రామపంచాయతీ కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగించి, చదును చేశారు. బుధవారం సాయంత్రం ఈద్గాకు రంగులు వేసి, టెంట్‌లు ఏర్పాటు చేశారు. ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్‌రావు తెలిపారు.

ఈద్గాను సందర్శించిన కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానాన్ని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి బుధవారం సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈద్గాకు వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అన్ని వసతులు కల్పించాలన్నారు. పండుగను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మైనార్టీ నాయకులు రషీద్, షకీల్, అతిక్ ఉల్ రహమాన్, షాహిద్, ఖలీం, కయ్యూం, ముజ్జు, ఇర్ఫాన్ ఖాన్ పాల్గొన్నారు.

అంబేద్కర్ చూపిన బాటలో నడవాలి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరూ అంబేద్కర్ చూపిన బాటలో నడవాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని సాలెవాడ(కె)లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. మహనీయుడి సిద్ధాంతాలను, ఆలోచనలను నిత్య జీవితంలో పాటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను మహిళా సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, చంద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకుల పంపిణీ..

రంజాన్ పండుగ పురస్కరించుకొని నిరుపేదల ముస్లింలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నిత్యవసర సరుకులు అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. 500 మందికి సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యుం, ఏక్బాల్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే 'ఫ్లాగ్‌మార్చ్'

నార్నూర్: లోకసభ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రవికిరణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్వాగతం కమాన్ నుంచి విజయ్‌నగర్ కాలనీ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ ఐక్యత సోదరభావంతో మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేద్దాం

ఉట్నూర్‌రూరల్: ఈనెల 13న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే గెస్ట్ లెక్చరర్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, సయ్యద్ జావిద్‌లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. డిగ్రీ కళాశాల లెక్చరర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గంజాయి పట్టివేత

నార్నూర్: గాదిగూడ మండలంలోని మేడిగూడ, గాదిగూడ శివారులో బుధవారం 8 కిలోల గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై మహేష్‌కుమార్ తెలిపారు. గాదిగూడ మండలంలోని చిత్తగూడ గ్రామానికి చెందిన టికం మారోతి, మాడవి లచ్చుల వద్ద 4 కిలోలు, కునికాసా గ్రామానికి చెందిన మాడవి జంగు, మేడిగూడ గ్రామానికి చెందిన హెచ్‌కే దాదిరావు వద్ద 4 కిలోలు గంజాయి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామంలో పడ్వాల్ సద్దుసింగ్‌కు చెందిన ఆవు బుధవారం మేత కోసం వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్‌శాఖ అధికారులు మృతి చెందిన ఆవును పరిశీలించి పరిహారం అందేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నాడు.

చలివేంద్రాలను ప్రారంభించిన కేఎస్ఆర్

కైలాస్‌నగర్: ఎండల తీవ్రత నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని అనుకుంట, బంగారిగూడ కాలనీల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రారంభించారు.

జోరుగా గోడం నగేశ్ ప్రచారం



ప్రజలతో మాట్లాడుతున్న గోడం నగేశ్

నార్నూర్: బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. బుధవారం మండలంలోని జండా, తడిహత్నూర్, గాదిగూడ మండలంలోని పిప్రీ, సావరి, ఝరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు ప్రజలు అడుగడుగున నీరాజనం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీగా ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి, చూపిస్తానని అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశ రక్షణకు ఎంతో కృషి చేస్తున్నారని, బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఒకసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. అనంతరం హిందూ ఉత్సవసమితి జిల్లా నాయకుడు జ్ఞానోబా పుస్కర్, మాజీ జెడ్పీటీసీ రూపావతి పుస్కర్‌లు ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట బీజేపీ అధికార ప్రతినిధి ఆత్మరావ్ నాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జి కోట్నాక్ విజయ్, గాదిగూడ జెడ్పీటీసీ గంగుబాయి, మండల అధ్యక్షుడు శివాజీ, ఆంజనేయ గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

ఇచ్చోడ: భారత రాజ్యాంగ రక్షణ కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు ఆత్రం భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని మేడిగూడ, మాన్కపూర్, దర్మంపూరి, గేర్జం, యాపాలగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రజలను విభజించి పాలిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ మొదటిసారిగా ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి ఆదివాసీ మహిళకు టికెట్ ఇచ్చిందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఆదివాసీ నాయకులు మహేందర్, కధం శివకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'ఏకపక్ష నిర్ణయాలు సరికాదు'

నేరడిగొండ: మండల అధ్యక్ష ఎన్నిక విషయంలో ఏకపక్ష నిర్ణయాలు సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇలాంటి నిర్ణయాలతో రానున్న రోజుల్లో పార్టీకి నష్టం కలుగుతుందన్నారు. సమావేశంలో గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంధం నవీన్, కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు కటకవల్ ఉత్తం, ప్రధాన కార్యదర్శి సోలంకి ప్రశాంత్, ఆకుల రాజశేఖర్, పాలియడ్ విష్ణు, సుభాష్, ప్రవీణ్, రామోజీ నవీన్ చారి పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్లతో ఎస్సై రాజు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామ శివారులోని సుద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం సాయంత్రం పట్టుకున్నట్లు లోకేశ్వరం ఎస్సై రాజు తెలిపారు. అనుమతుల్లేకుండా సుద్దవాగు నుంచి లోకేశ్వరం వైపు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. త్వరలో తహసీల్దార్ కార్యాలయంలో అప్పగిస్తామని.. తహసీల్దార్ మోతీరాం జరిమానా విధిస్తారని పేర్కొన్నారు.

ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ సర్పంచ్, ఆదివాసీలు

బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని కొబ్బాయి గ్రామ శివారులోని వాగులో అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని బుధవారం మాజీ సర్పంచ్ గేడాం మనోజ్, గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ సవాయిసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఆదివాసీల అనుమతి లేకుండా, పెసా చట్టానికి విరుద్ధంగా అక్రమ తవ్వకాలు చేసేందుకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. పెద్దపెద్ద యంత్రాలతో తవ్వకాలను చేపట్టి, అక్రమంగా వాగు ఇసుకను మహారాష్ట్రలోని నేషనల్ హైవే పనులకు తరలించడం సరికాదన్నారు. తవ్వకాలు నిలిపివేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చామని తహసీల్దార్ తెలిపారు.

బీజేపీకి కార్యకర్తల రాజీనామా



రాజీనామా పత్రం చూపిస్తున్న కార్యకర్తలు

గుడిహత్నూర్: గుడిహత్నూర్ బీజేపీ మండలాధ్యక్షుడి మార్పుపై నిరసన వ్యక్తం చేస్తూ మండలంలోని పలువురు బీజేపీ కార్యకర్తలు రాజీనామాలు చేశారు. మండలంలోని కార్యకర్తలతో సమావేశం నిర్వహించకుండా, సంప్రదింపులు జరుపకుండా ఏకపక్షంగా మండలాధ్యక్షుడి మార్పును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. రాజీనామా చేసిన వారిలో మాజీ మండలాధ్యక్షుడు జాడి సుభాష్, మండల ప్రధాన కార్యదర్శి చందాపురే సందీప్, బీజేవైఎం మండలాధ్యక్షుడు తిడ్కే నితీష్, కేంద్రే సంజీవ్, ఆకాష్, కరాడ్ రవి, ముర్కుటే వినోద్, కేంద్రే నితేష్, జగదీష్ ఉన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు



బోరుబావిని పరిశీలిస్తున్న పుల్లయ్య

ఇచ్చోడ: మారుమూల గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని బావుజజీపేట్ పరిధిలోని తండా, సోమన్నగూడ, గోండుగూడ గ్రామాల్లో ఎంపీడీవో లక్ష్మణ్‌తో కలిసి పర్యటించారు. బోరుబావులు, మిషన్ భగీరథ పైపులైన్లను పరిశీలించారు. ప్రభుత్వం తాగునీటికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నీటిఎద్దడి లేకుండా చూస్తామని గ్రామస్తులకు వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



పాతఎల్లాపూర్‌లో చిన్నారులతో సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని భర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంతోపాటు మండలంలోని పాతఎల్లాపూర్ పరిధిలోని మూడు కేంద్రాల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాతఎల్లాపూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోకి మూడేళ్లల్లో వచ్చి ఐదేళ్లు నిండిన వారిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వరలక్ష్మి, సుమలత, మంగ, సత్తెమ్మ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ఓటు అభ్యర్థిస్తున్న సామ రూపేష్‌రెడ్డి

బేల: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్‌లు కోరారు. బుధవారం మండలంలోని సదల్‌పూర్ శివారులోని బైరందేవ్, మహాదేవ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గణేష్‌పూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, అర్హులైన నిరుపేదలకు 200 యూనిట్ల విద్యుత్, రూ.500కే వంట గ్యాస్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.10 లక్షల పెంచడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తుందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నైతం సీతరాం, గోడే అవినాష్, ఠాక్రే విపిన్, కన్యరాజు, ముక్రె దీపక్, పురుషోత్తం, బాపురావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

తాంసి: మొక్కల పెంపకంపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పొన్నారి గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రతీరోజు నీటి తడులు అందించాలన్నారు. అనంతరం ఉపాధిహామీ పనులు పరిశీలించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, తదితరులు ఉన్నారు.